

సోమశిలలో 72.27 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారం 72.27 టీఎంసీల నీరుంది. పైతట్టు ప్రాంతాల నుంచి 10,388 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.78,800
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,130
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,344
నవర (8 గ్రాములు)	రూ.58,752

గరిష్ఠం/కనిష్ఠం
31.1 /24.4

వాతావరణం

జిల్లాలో శుక్రవారం వాతావరణం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ గురువారం 85 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

పెన్నానదిలోకి వెళ్లొద్దు

నెల్లూరు(అర్బన్): పైతట్టు ప్రాంతాల నుంచి సోమశిల ప్రాజెక్టులోకి వచ్చే వరదను పరిశీలిస్తున్నామని సందర్భాన్ని బట్టి నదిలోకి నీటిని విడుదల చేయాల్సి ఉన్నందున పెన్నానది పరివాహక ప్రజలు నదిలోకి రెండు రోజులు వెళ్లవద్దని కలెక్టర్ ఆనంద్ సూచించారు. ప్రస్తుతానికి ఎటువంటి వరద ప్రమాదం లేదన్నారు. పైనుంచి వచ్చే ఇన్‌ఫ్లోను బట్టి చర్యలుంటాయని తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు 2వేల ఎకరాల్లో నీరు నిలిచిపోయిందన్నారు. జిల్లాకు రూ.50 కోట్లు అత్యవసర పనులకు విడుదల కాగా అందులో సోమశిల ప్రాజెక్టుకు కూడా కొంత మంజూరయిందని తెలిపారు.

54 మంది హెల్త్ అసిస్టెంట్లను తొలగిస్తూ ఉత్తర్వులు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో 2002, 2006, 2013 తదితర సంవత్సరాల్లో హెల్త్ అసిస్టెంట్లుగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో ఉద్యోగం పొందిన వారిని ఇప్పుడు తొలగిస్తూ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రిక్రూట్‌మెంట్‌లో లోపాలు జరిగాయని అప్పట్లో ఉన్న ప్రభుత్వం 273 జీవో విడుదల చేసింది. దాని ప్రకారం 125 మంది మాత్రమే హెల్త్ అసిస్టెంట్లుగా ఉండాలి. మరో 54 మంది ఉద్యోగాలు కోల్పోవాల్సి వచ్చింది. అయితే వారందరూ 2013లో తమను తొలగించవద్దని హైకోర్టుకు వెళ్లారు. నాటి తెలంగాణలోని హైకోర్టు వారిని తొలగించవద్దని తాత్కాలికంగా విధుల్లో కొనసాగించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. తర్వాత రాష్ట్రం విడిపోయినప్పటికీ 1207 జీవో ప్రకారం వారిని తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగంలో కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు తాజాగా గత నెల 29న తీర్పునిస్తూ ఎక్కువగా ఉన్న హెల్త్ అసిస్టెంట్లను తొలగించాలని తీర్పు చెప్పింది.

నర్సింగ్ కళాశాల ఎదుట విద్యార్థినుల బైఠాయింపు

కావలి: కావలి సమీపంలోని శ్రీసాయి నర్సింగ్ కళాశాల యాజమాన్యం అధిక ఫీజులు కట్టాలంటూ ఇబ్బందికి గురిచేస్తోందని గురువారం కొందరు విద్యార్థినులు ఆందోళనకు దిగారు. యాజమాన్యాన్ని ఫీజుల విషయమై అడిగేందుకు జనసేన నాయకులతో కలిసి కాలేజీ వద్దకు వెళ్లగా సిబ్బంది లోపలికి వెళ్లనీయకుండా అడ్డుకోవడంతో విద్యార్థినులు, జనసేన నాయకులు కాలేజీ గేటు వద్ద బైఠాయించారు. కొద్దిసేపటికి పోలీసులు రంగప్రవేశం చేశారు. కాలేజీపై గతంలోనే అనేక ఆరోపణలు వచ్చాయని, అయినా అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని విద్యార్థినులు ప్రశ్నించారు. కలెక్టర్ స్పందించి కాలేజీ యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.


9 నుంచి బీఈడీలో స్పాట్ అడ్మిషన్లు

నెల్లూరు (టౌన్): స్థానిక ప్రభుత్వ బీఈడీ కళాశాలలో వివిధ సబ్జెక్టుల్లో మిగిలిపోయిన సీట్లకు ఈనెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎడ్‌సెట్–2024లో అర్హత సాధించి ఎక్కడా ప్రవేశం పొందని విద్యార్థులు నేరుగా కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావచ్చన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1000లతో పాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9346425012, 9032604255 నంబర్లను సంప్రదించాలన్నారు.

అరకొర నిధులతో ఎలా...?

మండిపడుతున్న ఉపాధ్యాయులు

- 7న మెగా పేరెంట్స్–టీచర్స్ సమావేశం
- డెకరేషన్, ఆటల పోటీలు, సహపంక్తి భోజనాలు
- విద్యార్థుల సంఖ్యను బట్టి నిధుల మంజూరు
- పాఠశాలల సమస్యలపై నుంచి పేరెంట్స్ దృష్టి మరల్చే యత్నం



పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా తయారైంది ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి. కూటమి ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు పూర్తికావస్తున్నా.. నేటికీ బడుల్లో సమస్యలపై దృష్టి పెట్టలేదు. పైగా గత ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందించేందుకు అమలు చేసిన సీబీఎస్‌ఈ, ఇంగ్లిషు మీడియం, ట్యాబ్‌ల పంపిణీ, డిజిటల్ విద్య తదితర వాటికి మంగళం పాడే దిశగా పావులు కదుపుతోంది. ఈ సమస్యల నుంచి పేరెంట్స్ దృష్టి మరల్చేందుకు పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌లు పెడుతోంది.

నెల్లూరు (టౌన్): కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు రెండో విడతలో ఎంపికైన పాఠశాలల్లో నాడు–నేడు పనులకు ఒక్క పైసా విడుదల చేయలేదు. దీనిపై తల్లిదండ్రుల దృష్టి మరల్చేలా ప్రభుత్వ పాఠశాలలను మేం ఉద్ధరిస్తున్నామని చెప్పేందుకు ఈనెల 7వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌లు పెడుతోంది. వీటిని నిర్వహించేందుకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో అలంకరణ, టెంట్, మైకు, తల్లిదండ్రులకు విడివిడిగా ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేత, విద్యార్థులు, తల్లిదండ్రులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయడం వంటివి చేస్తారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ఏ విధంగా సరిపోతాయని ఆయా పాఠశాలల హెడ్ మాస్టర్లు, టీచర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



కేఎన్నార్ మున్సిపల్ ఉన్నత పాఠశాల

నిధులు మంజూరు ఎలా అంటే ..

పాఠశాలల్లో జరిగే పేరెంట్–టీచర్స్ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు మంజూరు చేసింది. జిల్లాలో మొత్తం 2604 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 1.60 లక్షల మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలకు రూ.48.67 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఇంకా చాలక పోతే బయట నుంచి దాతల ద్వారా నిధులు సమీకరించుకోవాలని సూచించింది.



తరగతి గదిలో విద్యార్థులకు బోధిస్తున్న టీచర్

అరకొర నిధులపై మండిపాటు

పేరెంట్స్–టీచర్స్ సమావేశం పండగలా నిర్వహించాలని ఆదేశించిన ప్రభుత్వం నిధుల విడుదలలో అంత శ్రద్ధ కనబరచలేదని ఉపాధ్యాయులు, హెడ్‌మాస్టర్లు మండిపడుతున్నారు. కొద్దిపాటి నిధులతో ఈ కార్యక్రమాలు ఏ విధంగా చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు పాఠశాల అలంకరణకే సరిపోతాయంటున్నారు. పోటీలు నిర్వహణకు వస్తువుల కొనుగోలు, బహుమతులు, టెంట్, మైకు తదితర వాటికి ఎక్కడ నుంచి నిధులు సమీకరించాలో తెలియడం లేదని వాపోతున్నారు.

నిధుల మంజూరు ఇలా..

ఎన్‌రోల్‌మెంట్	నిధుల కేటాయింపు
0-10	రూ.1000
11-25	రూ.1200
26-50	రూ.1600
51-75	రూ.2000
76-100	రూ.2400
101-200	రూ.3000
201-300	రూ.4000
301-400	రూ.5000
401-500	రూ.6000
501-600	రూ.7000
601-700	రూ.8000
701-800	రూ.9000
801-900	రూ.10,000
901-1000	రూ.11,000
1001-1500	రూ.12,000

ప్రాథమికి పాఠశాలకు కనీసం రూ.3 వేలు కావాలి

ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం రూ.3వేలు నిధులు మంజూరు చేయాలి. అదే విధంగా ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా మంజూరు చేసిన నిధులతో పాటు అదనంగా నిధులు మంజూరు చేయాలి. ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ఖర్చులకు సరిపోవు.

– సురేంద్రరెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఏపీటీఎఫ్

ఏ మాత్రం సరిపోవు

7న పాఠశాలల్లో నిర్వహించనున్న పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు ఏ మాత్రం సరిపోవు. ఈ కార్యక్రమం ఖర్చుతో కూడుకున్న పని. దాతలు కూడా ముందుకు వచ్చే పరిస్థితి లేదు. ఉపాధ్యాయులు ఇబ్బందులు పడతారు కనుక ప్రభుత్వమే మరిన్ని నిధులు కేటాయించాలని కోరుతున్నాం.

– ఎం.నవకోటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి, యూటీఎఫ్

విజయవంతం చేద్దాం

పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌ను ఆయా పాఠశాలల్లో విజయవంతంగా నిర్వహిద్దాం. ప్రతి పాఠశాల హెడ్ మాస్టరు, ఉపాధ్యాయులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. ఇప్పటికే ఆయా మండలాల ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలకు ఆదేశాలు జారీ చేశాం. డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు పర్యవేక్షించాలి.

– బాలాజీరావు. డీఈఓ

రేపు పండగలా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్

- కలెక్టర్ ఆనంద్



నెల్లూరు(అర్బన్): జిల్లా వ్యాప్తంగా 2064 పాఠశాలల్లో ఈనెల 7న (శనివారం) పండుగ వాతావరణంలో మెగా పేరెంట్స్–టీచర్స్ సమావేశాలను నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువును బలోపేతం చేసేందుకు తద్వారా విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులు హాజరవుతారని అయితే రాజకీయాలకు సంబంధం లేకుండా పాఠశాలలో మౌలిక వసతులు, నాణ్యమైన చదువు గురించి చర్చించేందుకు మాత్రమే ఈ సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఇతరులు కలిసి జిల్లా వ్యాప్తంగా 5 లక్షల మంది సమావేశాల్లో పాల్గొనబోతున్నారని తెలిపారు. సమావేశంలో విద్యార్థుల ప్రోగ్రెస్ గురించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చర్చిస్తారన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

- గ్రామాల్లో అర్జీల స్వీకరణ
- ప్రతి మండలానికి స్పెషల్ ఆఫీసర్



మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరు(అర్బన్): భూసమస్యలు, అడంగళ్, నోషనల్ ఖాతా, రెవెన్యూ సర్టిఫికెట్ తదితర అన్ని రకాల రెవెన్యూ సమస్యలను పరిష్కరించడానికి శుక్రవారం నుంచి జిల్లా వ్యాప్తంగా 737 రెవెన్యూ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లోని తమ ఛాంబర్‌లో సాక్షితో మాట్లాడారు. ఈ సదస్సులు జనవరి 8 వరకు జరుగుతాయని తెలిపారు. సమస్యలపై జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వరకు వ్యయప్రయాసాలకోర్చి రాకుండా ఉండేందుకు, సంవత్సరాల తరబడి పరిష్కారం కాని సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించేందుకు సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. మండలస్థాయి తహసీల్దార్‌లు, వీఆర్వో, వీఆర్‌ఏలు, మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్‌లు మొత్తం మండల రెవెన్యూ కేంద్రంలో ఉన్న ప్రజలకు సంబంధించిన అన్ని రకాల రికార్డులు, కంప్యూటర్‌తో సహా గ్రామ సదస్సుకు హాజరవుతారని తెలిపారు. ప్రతి మండలానికి ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించామన్నారు. ఈ స్పెషల్ ఆఫీసర్ కూడా పర్యవేక్షణ చేసి ప్రజల సమస్యలు తొలగిస్తారన్నారు.

గ్రామాల సుస్థిర అభివృద్ధికి చర్యలు

- జెడ్పీ సీఈఓ విద్యారమ



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ విద్యారమ

నెల్లూరు(పొగతోట): గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పిస్తూ అన్ని రంగాలలో అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సీఈఓ విద్యారమ మండల అధికారులకు సూచించారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏపీఎంలు, ఐసీడీయస్ సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో సీఈఓ మాట్లాడారు. ఆయా గ్రామాలలో వ్యవసాయం అభివృద్ధికి ఏఏ పంటలు సాగు చేయాలో అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సీసీ రోడ్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో అధికారులు రమేష్, మండల అధికారులు పాల్గొన్నారు.

అలుగులపై ఉధృతంగా నీరు



రంగనాయుడుపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మోటుచెరువు వాగు

- వాహనాల రాకపోకలకు అటంకం
- అవస్థలు పడిన ప్రయాణికులు

సీతారామపురం: కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల ధాటికి గ్రామాల్లోని వాగులు, వంకలు నిండుగా ప్రవహిస్తుండగా పలు చెరువుల అలుగులు పారుతున్నాయి. గురువారం ఉదయం నుంచి రంగనాయుడుపల్లి గ్రామ సమీపాన మోట చెరువు కింద గల వాగు ఉధృతంగా ప్రవహిస్తుండగా ఉదయగిరి వైపు వెళ్లే గ్రామాలకు వాహనాల రాకపోకలు పూర్తిగా ఆగిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అలాగే ఓగూరువాండ్లపల్లి గ్రామ సమీపాన వాగు కూడా ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆ మార్గంలో కూడా ప్రకాశం జిల్లా సీఎస్ పురం వెళ్లేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ రెండుచోట్ల జాతీయ రహదారి పనులు జరుగుతుండటంతో వాగు ప్రదేశాలలో బ్రిడ్జిలు నిర్మించేందుకు తాత్కాలికంగా వేసిన డైవర్షన్ మట్టిరోడ్లు వాగుల ప్రవాహం ధాటికి కోతకు గురయ్యాయి. దీంతో ఆయా మార్గాలలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మర్రివూట్ల రిజర్వాయరు అలుగు పొంగి పొర్లుతుండటంతో రంగనాయుడుపల్లి వద్దగల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మండలవాసులు ఉదయగిరికి వెళ్లేందుకు వాహనాలు లేక ఎక్కడికక్కడే నిలబడిపోయారు.

పుష్ప–2కు పోటెత్తిన అభిమానులు



కావలి: అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' సినిమా థియేటర్లకు జిల్లాలో అభిమానులు గురువారం పోటెత్తారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఆయా వెర్షన్‌లలో ఏకకాలంలో సినిమా విడుదలైంది. ప్రీరిలీజ్ బుకింగ్స్ దేశంలో రూ.100 కోట్లను అధిగమించాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 58 స్క్రీన్‌లపై బుధవారం రాత్రి 9.30 గంటల నుంచే బెనిఫిట్ షోతో పుష్ప 2 చిత్ర ప్రదర్శన ప్రారంభమైంది. నిన్న రాత్రి నుంచి ఈ రోజు వరకు థియేటర్లలో ఒక్కో స్క్రీన్‌పై 8 షోలు ప్రదర్శించారు. అంటే 464 ప్రదర్శనలు తొలి రోజుకు పూర్తి చేసుకొని జిల్లా సినిమా చరిత్రలో సరికొత్త రికార్డు నమోదు చేసింది. అల్లు అర్జున్, రష్మిక మందన్నల నటన మునుపెన్నడూ లేని విధంగా ఆకట్టుకుందని వీక్షకులు మురిసిపోతున్నారు. మూవీకి థియేటర్ నుండి మంచి మౌత్ టాక్ ఉండటంతో రాబోయే రోజుల్లో మంచి వసూళ్లు రాబడుతుందని అంటున్నారు. అల్లు అర్జున్ అభిమానులు థియేటర్‌ల వెలుపల కేరింతలు, ఈలలు,



చప్పట్లతో పండుగలా జరుపుకున్నారు. ఉత్సాహంగా టపాసులు కాల్చుతూ సందడి చేశారు. దర్శకుడు సుకుమార్ సినిమాలో ఎక్కడా ఫైర్ తగ్గించకుండా అద్భుతంగా మలిచాడని చెబుతున్నారు. జాతర ఎపిసోడ్‌లో హీరో పెర్ఫార్మెన్స్ చాలా బాగుందని సినిమా చూసిన అభిమానులు చెబుతున్నారు.



వేతన వెతలు

ఎండీఎం నిర్వాహకులకు 3 నెలలుగా అందని బకాయిలు

- ఆర్థిక ఇబ్బందులతో సతమతం
- ఆయాలు, వాచ్‌మెన్‌లకు 6 నెలలుగా అదే పరిస్థితి

పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కింద వంటలు చేస్తున్న నిర్వాహకులు మూడు నెలలుగా బకాయిలు కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. ప్రస్తుతం కూరగాయలు, నిత్యావసర సరుకులు, గ్యాస్ సొంతంగా కొనుగోలు చేసి విద్యార్థులకు వండి పెడుతున్నారు. అప్పులు చేసి కష్టపడి వంట వండినప్పటికీ బిల్లుల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోంది. – కావలి



విద్యార్థినులకు మధ్యాహ్న భోజనం వడ్డింపు

➡ పీఎం పోషణ్ కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) నిర్వాహకులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తున్నాయి. వీటిలో సింహభాగం కేంద్ర ప్రభుత్వ నిధులు కాగా రాష్ట్రం కేటాయించేది నామమాత్రమే. కానీ వాటిని కూడా సరిగా జమచేయలేకపోతోంది.


➡ జిల్లాలో మొత్తం 2,604 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 1,60,000 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 1,51,071 మంది వరకు భోజనం చేస్తుంటారు.

ప్రభుత్వం నుంచి బియ్యం, కోడిగుడ్డు అందుతుండగా, వంటకు అవసరమైన కంది పప్పు, కూరగాయలు, గ్యాస్, నూనె, వంట సామగ్రి తదితర వాటిని భోజన తయారీదారులే కొనుగోలు చేసి వంట చేస్తున్నారు.

➡ ప్రస్తుతం మార్కెట్లో కూరగాయలతోపాటు నిత్యావసర సరుకుల ధరలు అధికంగా ఉన్నాయి. పామాయిల్ ప్యాకెట్ రూ.145, ఎర్రగడ్డలు కేజీ రూ.70, టమోటా కేజీ రూ.60 ఇలా ప్రతిదీ ధరలు మండిపోతున్నాయి. ఈ ధరలతో భోజన తయారీదారులు వంట చేయడానికి నిత్యం సతమతమయ్యే పరిస్థితి నెలకొంది.

➡ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థికి ఒకరికి కేంద్ర ప్రభుత్వం రూ.5.45పై. ఇస్తే, దానికి రాష్ట్ర ప్రభుత్వం 43 పైసలు జత చేసి రూ.5.88 పై. చొప్పున ఇస్తున్నారు. కాగా కేంద్ర ప్రభుత్వం తన వాటా రూ.5.45 పై. నుంచి రూ.6.19 పై. కి పెంచింది.

ఇదీ జిల్లా వివరాలు



➡ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల్లో చదివే విద్యార్థులకు ఒక్కొక్కరికి కేంద్ర ప్రభుత్వం రూ.8.17 పై. ఇస్తుండగా, దానికి రాష్ట్ర ప్రభుత్వం 40 పైసలు జత చేసి రూ.8.57 పై. ఇస్తోంది. కాగా కేంద్ర ప్రభుత్వం తన వాటాను రూ.8.17 పై. నుంచి రూ.9.26 పై.కు పెంచింది. నవంబర్ నెల వరకు పాత ధరల ప్రకారమే బిల్లులు చెల్లిస్తారని, డిసెంబర్ 1 నుంచి కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరల ప్రకారం బిల్లులు ఎండీఎం ఏజెన్సీలకు జమ అవుతాయని భావిస్తున్నారు.

➡ ప్రభుత్వ పాఠశాలలను శుభ్రంగా ఉంచేందుకు నియమించిన ఆయాలకు, వాచ్‌మెన్‌లకు కూడా జూన్ నుంచి నవంబర్ వరకు ఆరు నెలల వేతనాలు వారి బ్యాంక్ అకౌంట్‌లలో జమ కాలేదు.

➡ ఒక్కో ఆయాకు నెలకు రూ.6,000 చొప్పున ఏడాదిలో 10 నెలలు వేతనం ఇస్తారు. వేసవి సెలవుల రెండు నెలల్లో సగం వేతనం ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే వాచ్‌మెన్‌లకు నెలకు రూ.6,000 ఇస్తారు. ఆయాలకు, వాచ్‌మెన్‌లకు వేతనాలు జమ కాక, తీవ్ర జాప్యం జరుగుతుండటంతో కుటుంబపోషణ భారమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బిల్లులందేలా చర్యలు

ప్రభుత్వం దృష్టిలో అన్ని అంశాలు ఉన్నాయి. వాటన్నింటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటుంది. అంతిమంగా ప్రభుత్వ లక్ష్యమైన విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి. అలాగే పాఠశాల ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉండాలి. ప్రభుత్వ ఆస్తికి రక్షణ కల్పించాలి. మధ్యాహ్న భోజన పథక ఏజెన్సీలు, స్వీపర్లు, వాచ్‌మెన్‌లకు సంబంధించిన చెల్లింపులు అన్నీ కూడా సత్వరమే అందేలా చర్యలు తీసుకుంటాం.

బాలాజీరావు, జిల్లా విద్యాశాఖాధికారి, నెల్లూరు



మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థినులు

క్లుప్తంగా

ఎస్ఈఐఎల్‌కు అవార్డు


హర్షం వ్యక్తం చేస్తున్న ఎస్ఈఐఎల్ ఉద్యోగులు

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా ప్రాజెక్ట్‌ను ప్రతిష్ఠాకరమైన 'గ్రేట్ ప్లేస్ టు వర్క్ – సర్టిఫైడ్' అవార్డు వరించినట్టు ప్రతినిధులు గురువారం తెలిపారు. పని వాతావరణం, ఉద్యోగుల వృద్ధి తదితర అంశాల్లో పురోగతి సాధించినందుకు అవార్డు వచ్చినట్టు సంస్థ సీఈఓ రాఘవ్ త్రివేది వెల్లడించారు. ఉద్యోగులు పనిచేయడానికి తమ సంస్థ గొప్ప ప్రదేశమైనందుకు గర్వంగా ఉందన్నారు. వర్క్ ప్లేస్ కల్చర్‌పై గ్లోబల్ అథారిటీ ఉద్యోగుల్లో నిర్వహించిన సర్వే, నాయకుల అభిప్రాయం, సాంస్కృతిక వ్యవహారాలు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఈ అవార్డును ప్రకటించిందన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

- అదుపులో ఇద్దరు టీడీపీ నేతలు?

వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీ జోసఫ్‌పేటలో పేకాట స్థావరాలపై గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. జోసఫ్‌పేట సమీపంలో ఇరిగేషన్ కార్యాలయంలో నిత్యం పేకాట ఆడుతున్నారని స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో నిఘా పెట్టి దాడులు చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.2,275 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో ఇద్దరు స్థానిక టీడీపీ నాయకులున్నట్లు సమాచారం.

వ్యక్తి ఆత్మహత్య


శ్రీనివాసులు మృతదేహం

బుచ్చిరెడ్డిపాళెం: ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని కట్టుబడిపాళెంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కట్టుబడిపాళేనికి చెందిన తిరువాయిపాటి శ్రీనివాసులు (35) అనే వ్యక్తి చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. దీంతో కుటుంబంలో నిత్యం గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనస్తాపం చెందిన శ్రీనివాసులు బుధవారం గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి నెల్లూరులోని ఓ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంతోష్‌రెడ్డి తెలిపారు.

9 సవర్ల బంగారం చోరీ


వివరాలు సేకరిస్తున్న ఎస్సై

కోవూరు: ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దొంగలు తలుపులు పగులగొట్టి బంగారు ఆభరణాలు చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని పడుగుపాడులో జరిగింది. గురువారం పోలీసులు వివరాలు వెల్లడించారు. పడుగుపాడు ధాత్రి గ్రీన్ హోమ్‌లో నివాసముంటున్న అమీనాబి మూడు నెలల క్రితం కూతురు వద్దకు వెళ్లగా అప్పటి నుంచి ఇంట్లో ఎవరూ లేరు. ఈ విషయాన్ని గమనించిన దొంగలు ఇంటి తలుపులు పగులకొట్టి 9 సవర్ల బంగారు ఆభరణాలు, కాళ్లపట్టీలు చోరీ చేశారు. చుట్టుపక్కల వారిచ్చిన సమాచారంతో అమీనాబి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై రంగనాథ్ గౌడ్ ఘటనా స్థలానికి వెళ్లి చోరీ పరిశీలించారు. క్లూస్ టీమ్ వచ్చి వేలుముద్రలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి :	రూ.30
సన్నవి :	రూ.20
పండ్లు :	రూ.12



- చిరుద్యోగుల పొట్ట కొడుతున్న కూటమి నేతలు
- ఏళ్ల తరబడి కొనసాగుతున్న వీఓఏల తొలగింపు
- నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ వర్గీయులకు అవకాశం
- కోర్టు ఉత్తర్వులిచ్చినా.. ఫలితం శూన్యం
- 60 ఏళ్ల నిబంధనలతో కొందరికి ఉద్వాసన

పొదుపు సంఘాల్లో పచ్చముద్ర



ఇటీవల నెల్లూరులో కలెక్టరేట్ ఎదుట ధర్నా

కూటమి ప్రభుత్వంలో టీడీపీ నేతల అరాచకాలకు అంతులేకుండా పోయింది. మహిళలు ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకునే పొదుపు సంఘాల్లోనూ పచ్చముద్ర వేస్తున్నారు. వీఓఏలను తొలగించి వారి స్థానంలో తమకు అనుకూలమైన వారిని నియమించుకుంటున్నారు. ఇది తప్పని.. పాతవారినే కొనసాగించాలని న్యాయస్థానం ఉత్తర్వులిచ్చినా అధికారులు బేఖాతరు చేస్తున్నారు. – నెల్లూరు (పొగతోట)

➡ గ్రామీణ ప్రాంతాల్లో పొదుపు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు వీఓఏ (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్)లు కృషి చేస్తుంటారు. వీరికి ప్రతి నెలా సెర్ప్ నుంచి రూ.8 వేల చొప్పున వేతనం బ్యాంక్ ఖాతాల్లో జమవుతుంది.

➡ ప్రతి గ్రామానికి ఒక సమాఖ్య ఉంటుంది. పొదుపు మహిళలందరూ తీర్మానం చేసుకుని చదువుకుని ఉత్సాహంగా ఉండే మహిళను వీఓఏగా నియమించుకుంటారు. గ్రూపులు అధికంగా ఉంటే ఇద్దరు లేదా ముగ్గురిని పెట్టుకుంటారు. వీఓఏ మూడు సంవత్సరాలు అంతకు మించి పనిచేసే అవకాశం ఉంది.

➡ ప్రవర్తన సక్రమంగా లేకపోయినా మహిళలందరితో సఖ్యతగా లేకపోయినా ఆమెను తొలగించి మరొకరిని నియమించుకునే వెసులుబాటు సమాఖ్యకు ఉంది. ఇందులో అధికారుల ప్రమేయం ఉండదు.

జిల్లాలో..

పొదుపు సంఘాలు :	గ్రూపులు :
4.50 లక్షలు	39 వేలు

➡ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాకముందు జిల్లాలో 1,400 మందికి పైగా వీఓఏలు ఉండేవారు. అధికారం రావడంతో టీడీపీ నేతలు చిరుద్యోగుల పొట్ట కొడుతున్నారు. వీరి ఒత్తిళ్లతో అనేక మండలాల్లో అధికారులు రాజకీయ నాయకుల్లా వ్యవహరిస్తూ వీఓఏలపై ఒత్తిడి తెస్తున్నారని విమర్శలున్నాయి.

➡ గత ప్రభుత్వానికి మీరు అనుకూలంగా పనిచేశారు. విధులు మానేసి వెళ్లిపోవాలని అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురిచేయడంతో పదుల సంఖ్యలో తప్పుకొన్నారు. ఇంకా సుమారు 650 మందికి పైగా వీఓఏలను సమాఖ్య తీర్మానం లేకుండానే తొలగించారు. నేతలు తమకు అనుకూలంగా ఉండేవారిని నియమించుకున్నారని విమర్శలున్నాయి.

➡ కలువాయి, చేజర్ల తదితర మండలాలకు చెందిన పలువురు కోర్టును ఆశ్రయించారు. కాగా అధికార పార్టీకి అనుకూలంగా మారిన వీఓఏలను తిరిగి నియమించుకున్నారు. మిగిలిన బాధితులు నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయం ఎదుట అనేక పర్యాయాలు ఆందోళనలు చేపట్టినా ఫలితం శూన్యం.

➡ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వీఓఏల నియామకంలో 60 ఏళ్ల నిబంధనను అమల్లోకి తెచ్చింది. గతంలో వయసుతో సంబంధం లేకుండా పనిచేసేవారు.

➡ కొత్త నిబంధనను అడ్డం పెట్టుకుని కూటమి నేతలు వీఓఏలను తొలగిస్తున్న సందర్భాలున్నాయి. అలాగే కొందరికి దీనిపై అవగాహన లేక విధుల్లో కొనసాగుతున్నారు. కానీ వీరికి వేతనాలు రావని అధికారులు చెబుతున్నారు.

నిబంధనలు పాటించాలి



వీఓఏలు అనేక అవమానాలకు గురవుతున్నారు. అధికారులు, రాజకీయ నాయకుల వేధింపులు అధికమయ్యాయి. వీఓఏగా రాజీనామా చేశాను. నియామకం, తొలగింపుల్లో నిబంధనలు పాటించాలి. ప్రస్తుతం నిబంధనలను పట్టించుకోకుండా తొలగిస్తున్నారు. గ్రామ సమాఖ్య తీర్మానం లేకపోయినా తొలగించి కొత్త వారిని నియమిస్తున్నట్లు ప్రకటిస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.
– సంపూర్ణమ్మ, వీఓఏల సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి

అధికారులకు సంబంధం లేదు



వీఓఏల తొలగింపు, నియామకం గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో జరుగుతుంది. పొదుపు మహిళలందరూ తీర్మానం చేసి నియమించుకుంటారు. వీఓఏల నియామకం, తొలగింపుల్లో అధికారులకు, రాజకీయ నాయకులకు ఎలాంటి అధికారం ఉండదు. తొలగింపు విషయమై అనేకమంది కోర్టును ఆశ్రయించారు. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.
– నాగరాజకుమారి, డీఆర్‌డీఏ పీడీ

చంద్రబాబుకు గుణపాఠం తప్పదు


మాలల మహాగర్జన వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న నేతలు

- 15న గుంటూరులో మాలల మహాగర్జన
- అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్

నెల్లూరు(బృందావనం): 'సీఎం చంద్రబాబు మాలల ద్రోహిగా వ్యవహరిస్తున్నారు. ఆయనకు గుణపాఠం తప్పదు' అని అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్, విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి ఉప్పులేటి దేవీప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన నెల్లూరుకు విచ్చేశారు. స్థానిక పురమందిరంలోని వర్ధమాన సమాజం హాల్లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మందకృష్ణ మాదిగను సీఎం చంద్రబాబు నాయుడు పావుగా వాడుకుంటున్నారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణతో షెడ్యూల్ కులాల మనుగడే భవిష్యత్‌లో ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్గీకరణతో జరిగే తీవ్ర అన్యాయాన్ని గుర్తించి మందకృష్ణ తన ఆలోచనలకు స్వస్తిపలకాలన్నారు. దేశంలో, రాష్ట్రంలో ఎస్సీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను 15 శాతం నుంచి 25 శాతం పెంచాలన్నారు. దళితుల రాజ్యాంగ హక్కులను రక్షించాలని డిమాండ్ చేశారు. ఈనెల 15వ తేదీన గుంటూరులో మాలల మహాగర్జన జరుగుతుందన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో జేఏసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తుల్లిబల్లి అశోక్‌బాబు, మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వర్ణ వెంకయ్య, దళిత విద్యార్థి, ఉద్యోగ సంఘాలు, మాలమహానాడు రాష్ట్ర, జిల్లా నేతలు విజయకుమార్, అరవ రాయప్ప, దళితబాబు, బల్లి వెంకయ్య, వాదనాల వెంకటరమణ, కూరపాటి గోపాల్, పి.వెంకయ్య, జి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

- జీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డీఎస్సీ, టెట్ అభ్యర్థులకు శిక్షణ
- కేవలం 45 మందే నమోదు
- వసతుల్లేక ఇబ్బందులు

మొక్కుబడిగా..


బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోచింగ్ సెంటర్


ఒకే హాల్లో అభ్యర్థులకు శిక్షణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డీఎస్సీ, టెట్ అభ్యర్థులకు ఇస్తున్న ఉచిత శిక్షణ మొక్కుబడిగా సాగుతోందనే విమర్శలున్నాయి. వందమందికి శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉన్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా కేవలం 45 మంది మాత్రమే నమోదయ్యారు. 20 నుంచి 30 మంది తరగతులకు హాజరవుతున్నారు. ఈ శిక్షణ రెండునెలలపాటు ఉంటుంది. ఈ కాలంలో నెలకు రూ.1,500 స్టైఫండ్, రూ.1,000 విలువైన మెటీరియల్‌ను అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆర్థికంగా వెనుకబడిన వారు ఎన్నో ఆశలు పెట్టుకోగా క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అనుకూలంగా లేవనే ప్రచారం ఉంది.

ఒకే హాల్లో..

నెల్లూరులోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న పాత మీ సేవా కేంద్రం భవనంలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. గత నెల 16వ తేదీ నుంచి తరగతులు నిర్వహిస్తున్నారు. కాగా ఒకే హాల్ ఉంది. నిర్వాహకులు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం కాకుండా తరగతులు గందరగోళంగా జరుగుతున్నాయి. అభ్యర్థుల్లో కొందరు తెలిపిన అభిప్రాయాల మేరకు మౌలిక వసతుల కల్పన గురించి అధికారులు పట్టించుకోలేదు. మహిళలకు మరుగుదొడ్ల వసతి లేదు. తాగునీటి కోసం క్యాన్లపై ఆధారపడాల్సిందే. ఒకవేళ నీరు అయిపోతే పట్టించుకునే నాథుడు లేడు. ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఉండడంతో రాకపోకలకు అనువుగా ఉన్నా స్టడీ సెంటర్ వద్ద ఆటోల ధ్వనులు తీవ్ర ఇబ్బందికరంగా ఉన్నాయని వాపోతున్నారు. దీనికితోడు టైమ్ టేబుల్ ప్రకారం కాకుండా ఎవరు వస్తే వారు క్లాస్‌లు తీసుకోవడం జరుగుతోందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి ప్రసూన వివరణ కోరగా ఉన్నతాధికారులను సంప్రదించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నెల్లూరు సిటీ: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన గురువారం జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. గుడిపల్లిపాడు గ్రామానికి చెందిన నెల్లూరు జగదీష్ (22) నెల్లూరుకు మోటార్‌బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో నారాయణరెడ్డిపేట వద్దకు వచ్చే సరికి గేదె అడ్డు రావడంతో తప్పించబోయి కింద పడ్డాడు. దీంతో యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేలిన కుక్కర్



ఉదయగిరి: పట్టణంలోని కరీమా వీధిలో ఓ ఇంట్లో మహిళ గురువారం వంట చేస్తుండగా ఒక్కసారిగా కుక్కర్ పేలింది. కుక్కర్‌లో పప్పు ఉడికిస్తూ ఇతర పనులు చేసుకుంటుండగా భారీ శబ్దంతో పేలిపోయింది. ఈ ఘటనలో గ్యాస్ స్టౌ కూడా దెబ్బతింది. మహిళకు ఎటువంటి ప్రమాదం జరగలేదు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 103 | లేయర్ (లైవ్) : 110
బ్రాయిలర్ చికెన్ : 196 | బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 216
లేయర్ చికెన్ : 187

పొంగి పొర్లుతున్న వాగులు



ఉదయగిరి: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో వారం రోజులుగా ఉదయగిరి మండలంలో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గురువారం 35.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. దున్నపోతుల, పిల్లాపేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో కొన్ని గ్రామాలకు రాకపోకలు కొంతమేర స్తంభించాయి. కొన్ని గ్రామాలలో ఉన్న చెరువులకు 60 శాతం మేర నీరు చేరింది. ఉదయగిరి ఆనకట్ట నిండి అలుగు పారుతోంది.


- మండలంలోని గండిపాళెం జలాశయ నీటిమట్టం 16.5 అడుగులకు చేరినట్లు ఇరిగేషన్ డీఈ కె.చంద్రమౌళి తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో జలాశయంలోకి 833 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతున్నట్లు వెల్లడించారు.

రాకపోకలకు అంతరాయం

ఆత్మకూరురూరల్: వర్షాలు, పైతట్టు ప్రాంతాల నుంచి వరద కారణంగా బొగ్గేరు ప్రవాహం పెరిగింది. దీంతో పది గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని గండ్లవీడు – వెన్నవాడ మధ్యలో బొగ్గేరు ప్రవాహం అధికమైంది. దీంతో వింజమూరు, దుత్తలూరు మండలాల నుంచి ఆత్మకూరు, మర్రిపాడు మండలాల వైపు డీసీపల్లి వద్ద గల జాతీయ రహదారి మీదుగా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. వింజమూరు మండలం నల్లగొండ్ల మీదుగా 12 కిలోమీటర్ల దూరం ప్రయాణించి గమ్యస్థానం చేరుకోవాల్సి వస్తోంది. బొగ్గేరుపై వెన్నవాడ – గండ్లవీడు మధ్య కాజ్‌వే నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పెరుగుతున్న నీటి మట్టం

వరికుంటపాడు: వర్షాలకు నక్కలగండి రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరుగుతోంది. రిజర్వాయర్ సామర్థ్యం 22 అడుగులు ఉండగా ఇప్పటికే 18 అడుగుల మేర నీరు చేరి నిండుకుండను తలపిస్తోంది. ఈ ప్రాజెక్ట్ కింద వరికుంటపాడు మండలంలోని పలుగ్రామాలతోపాటు ప్రకాశం జిల్లా పామూరు మండలంలో కొన్ని గ్రామాల కింద ఆయకట్టు ఉంది. కాగా తూము వద్ద నీరు వృథా అవుతోందని, దీనిని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.


వెన్నవాడ వద్ద బొగ్గేరు ఉధృతి

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

- రూ.70 లక్షల మేర ఆస్తి నష్టం

నెల్లూరు(క్రైమ్): ఫ్లవర్ డెకరేషన్ సామగ్రి గోదాములో అగ్నిప్రమాదం జరిగి రూ.70 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. అగ్నిమాపక శాఖ అధికారుల కథనం మేరకు.. నెల్లూరులోని బీవీ నగర్‌కు చెందిన రవికుమార్ ఫ్లవర్ డెకరేషన్స్ వ్యాపారి. అతడికి కొండాయపాళెంలో గోదాము ఉంది. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గోదాములో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ విషయాన్ని గమనించిన వాచ్‌మెన్ మణి యజమానికి ఫోన్ చేసి చెప్పాడు. రవికుమార్ అగ్నిమాపక అధికారులు, వేదాయపాళెం పోలీసులకు సమాచారం అందించాడు. డీఎఫ్ఓ వాకా శ్రీనివాసులురెడ్డి, ఏడీఎఫ్ఓ ఎస్.వేణుగోపాల్‌రావుల పర్యవేక్షణలో అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్ల సహాయంతో మంటలను ఆర్పివేశారు. రూ.70 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేశారు.